Feb 1963
6.వ.నా
వ.నం 74773

# ప్రేమ పెళ్ళి డబ్బు

అంగర సూర్యారావు



**"ఏం** కావాలి సార్?"

షో కేసులో వున్న చీర కేసి చూస్తూ కలలు కంటున్న బుచ్చిరాజు తల తిప్పి చూశాడు. సన్నగా, పొట్టిగా సర్కస్ బఫూన్‌లా వున్న 'సేల్సుమెన్' కనిపించాడు.

"ఆ చీర ఖరీదు ఎంత?" మొండాగా అడిగాడు బుచ్చిరాజు.

"రండిసార్! లోపలికి దయచేయండి."

"ధర చెప్పు!"

"యాభై రెండు!–అరరే! వెళ్ళి

పోతా రేమిటిసార్ ? ఏ ధరలో కావాలంటే ఆ ధరలో—ఏ రంగులో కావాలంటే ఆ రంగులో...'

సేల్సు మెన్ చెబుతూనే వున్నాడు బుచ్చిరాజు వెళుతూనే వున్నాడు.

బుచ్చిరాజు తనలో తాను నవ్వుకున్నాడు. తనకు చీర యెందుకు? తనకు పెళ్ళాం వున్నప్పుడు చీరలు, ఆభరణాలు వగైరా హంగులు కావాలి—తెల్లగా రబ్బరు బొమ్మలా వున్న అమ్మాయికి ఆ చీర ఎంత అందంగా వుంటుంది!! ఇంతకూ తనకు కాబోయే యిల్లాలు తెల్లగా వుంటుందన్న గ్యారంటీ యేమిటి? అసలు తనకు పెళ్ళి అయ్యే యోగం వుందా ?— ఈ ఆలోచన వచ్చేసరికి అతని మనసు విచారంతో నిండి పోయింది.

బుచ్చిరాజు నిరుపేద కుటుంబంలో పుట్టాడు. చిన్న ఉద్యోగానికి సరిపోయే చదువు మాత్రమేచదువుకున్నాడు. గుమాస్తా ఉద్యోగం సంపాదించాడు. చిన్నప్పటినుంచీ అతడిని మానసికంగా కుంగదీసిన సమస్య ఒకటి వుంది. అది తన ఆకారం! స్కూల్లో చదువుకునే రోజుల్లో అతనిని రకరకాల పేర్లతో పిలిచేవారు. బడి పంతుళ్ళు కూడా అతన్ని పేరుతో పిలిచేవారు కాదు. అతడిని సానుభూతితో — ఆదరంగా చూసినవాళ్లు ఒక్కరో! యిద్దరో! అవమానాన్ని, హేళనను సహించడం నేర్చుకున్నాడు. అతని అంతరాంతరాలలో అతనికి తెలియకుండా ద్వేషం, స్వార్థం అతనితోపాటు పెరుగుతున్నాయా? అన్నది కాలమే నిర్ణయించాలి.

అతనికి దొరికిన ఉద్యోగంకూడా విద్యాశాఖలోనే దొరికింది. ఉపాధ్యాయులతోను, విద్యార్థులతోను సరాసరి సంబంధంవున్న సీటు అతనికి యివ్వడం జరిగింది. రూల్సు నియమ నిబంధనలు అన్నీ బాగా అర్థం చేసుకున్నాడు. సమర్థ దరిపించుకున్నాడు. రెండేళ్ల సర్వీసు పూర్తి అయ్యేసరికి—యెవరిని యేవిధంగా యిబ్బంది పెట్టవచ్చో—ఇష్టమైనప్పుడు రూలును అనుకూలంగానూ — యిష్టంకానప్పుడు అదే రూలును వ్యతిరేకంగానూ ఎలా తిప్పుకోవచ్చో క్షుణ్ణంగా గ్రహించాడు. వ్యవహారాలు పరిష్కారం చెయ్యడంలో తన స్వంత పద్ధతి ఒకటి ప్రవేశపెట్టాడు.

టీచర్లు వాళ్ళ ఉద్యోగాలకు సంబంధించిన చిక్కులు ఏవి వున్నా అతని దర్శనం చెయ్యవలసిందే! దర్శనం చెయ్యకపోతే వాళ్ళ కాగితాలు పైకి రావు. దర్శనం చేస్తే చివాట్లు తప్పవు. బిగ్గరగా కేకలు వేసేవాడు కొట్టినంతపని చేసేవాడు. ఆ తరవాత వచ్చిన వాడితో కలిసి అవతలకివెళ్ళి తాంబూలం వేసుకొని మందస్మిత వదనుడై వది



నిమిషాలలో లోపలికి వచ్చేవాడు. వచ్చినవాడి పని పూర్తి అయ్యేది.

బుచ్చిరాజు డబ్బు తినేస్తున్నాడు మొర్రో, అన్నారు తోటి గుమాస్తాలలో కొందరు "తినెయ్యడంలేదు, మూట కడుతున్నాడు" అన్నారు మరికొందరు. ఎవరు ఎన్ని అనుకున్నా అవన్నీ గుసగుసలుగానే మిగిలిపోయాయి.

ఉద్యోగం ఖాయం అయిన మర్నాటినుంచీ బుచ్చిరాజు పెళ్ళి ప్రయత్నంలో వున్నాడు. ఇంటికి ఏ చుట్టం వచ్చినా బుచ్చిరాజు తల్లి "నా బుచ్చిగాడికి మంచి పిల్ల నెక్కడయినా చూసి పెట్టు నాయనా!" అంటూ వుండేది. ఆవిడ యెవరికి చెప్పినా యీమాటే చెప్పేది.

ఒకనాడు బుచ్చిరాజు అరుగు మీద కూర్చుని ముఖం కడుగుతున్నాడు. దారిని పోయేవాళ్ళంతా గోడ కేసి చూసి—క్షణం ఆగి — ముసి ముసి నవ్వులతో వెళ్ళిపోతున్నారు. అదేదైనా వాల్ పోస్టరా? కొత్త సినిమా ఏదైనా వచ్చిందా? అనుకుంటూ బుచ్చిరాజు రోడ్డు మీదికొచ్చి చూశాడు. తన గోడ మీద మసిబొగ్గుతో "బుచ్చిగాడికి పిల్ల కావాలి!" అని రాసి వుంది.

అగ్గి మీద గుగ్గిలం వేసినట్టయ్యింది. మండిపోయాడు. లోపలికివెళ్ళి తల్లిమీద తన కోపం అంతా చూపించాడు. చివరకు తల్లికి "వార్నింగు" యిచ్చాడు.

"అమ్మా! యిప్పుడే చెబుతున్నాను నీకు! ఈ రోజు మొదలు నువ్వు దారిని పోయే ప్రతి గాడిదతోనూ "మా బుచ్చిగాడికి పిల్లని చూడు" అని చెబితే నేను ఒప్పుకోను. అసలు నువ్వు చూడొద్దు, నా పెళ్ళాన్ని నేనే చూసుకుంటాను."

అప్పటినుంచీ బుచ్చిరాజు స్వయంగా పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించాడు. "కుర్రాడికి చిన్న ఉద్యోగం వుంది బ్రతుకు తెరువుకు ఆస్కారం వుంది. పిల్లని యివ్వొచ్చు" అని సుతండ్రి అయినా ఒక నిర్ణయానికి వస్తే పెళ్ళి కూతురో, పెళ్ళికూతురి తల్లో వ్యతిరేకించేది. ఏ మధ్యవర్తో బేరం కుదుర్చుకు వచ్చేవాడు. ఆ దరిమిలా బుచ్చిరాజు స్పెషల్‌గా కుట్టించిన సూట్ వేసుకొని బస్సులు దిగేవాడు. పెళ్ళి చూపులు పూర్తి కాగానే ఫలితం తేలిపోయేది. నిరాశతో, నిస్పృహతో గుండ్రని కడుపుమీది నుంచి కిందికి జారిపోతున్న ఫుల్‌ప్యాంటును పైకి లాగుతూ తిరుగు ప్రయాణం అయ్యేవాడు. రానూ పోనూ ఖర్చులు దండుగ, కాజువల్ లీవు నష్టం! పరువు నష్టం!

బుచ్చిరాజు చెప్పక పోయినా తోటిగుమాస్తాలు పరిస్థితి గ్రహించారు. "ఏమోయ్ బుచ్చిరాజూ! నా మాట

వీను. పెళ్ళిచూపులకునువ్వు వెళ్ళకు. నీతరఫున ఎవరినైనా పంపు!" అని వేళాకోళం చేసేవారు. బుచ్చిరాజు చిరునవ్వుతో పూరుకునేవాడు.

> తండ్రి కొడుకుతో:- 'మీ అమ్మ అన్న దాన్ని నువ్వు కాదంటూవుంటా వెధవా? నా కంటే గొప్పవాడివనా నీ వుద్దేశం?'

తనలోని శక్తి సామర్థ్యాలను మరో కోణంలో కేంద్రీకరించాడు బుచ్చిరాజు. ప్రైవేటుగా 'యూనివర్శిటీ' పరీక్షలకు హాజరయ్యాడు. కష్టపడి చదివి పరీక్ష పాస్సై బి.ఏ. పట్టా పుచ్చుకున్నాడు. ఒక సంవత్సరం బి. ఇడి. ట్రైనింగు చదివాడు. తన జీవితాదర్శమైన స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి ఆరేళ్ళలో అర్హత సంపాదించాడు.

మొదట జూనియర్ ఇన్‌స్పెక్టర్ అయ్యాడు తరవాత సీనియర్ ఇన్‌స్పెక్టర్ అయ్యాడు. కొత్త సర్వీసులో నిదానంగా పని ప్రారంభించాడు. తొందర పడలేదు. నలుగురు నడిచే దారిలోనే నడిచాడు. తనక్రిందయున్నవి ఎలిమెంటరీస్కూళ్ళు వున్నాయి. ప్రతి స్కూలుకు ఇన్‌స్పెక్షను చెయ్యడానికి, విజిట్ చెయ్యడానికి ఫీజులు చిరకాలంనుంచీ నిర్ణయించబడి వున్నాయి — ఎంత లేదన్నా సంవత్సరానికి పన్నెండు వందలు నికరాదాయం, అంటే పైరాబడి. ఇది అల్లరి లేనిదీ, అలవాటుపడ్డదీను! బుచ్చిరాజుకొన్ని కొత్త పద్ధతులు కనిపెట్టాడు. అవి అమలులో పెడితే పైరాబడి మూడు వేల దాకా దేకుతుంది. అయినా కొంత నిగ్రహంతో ఆగాడు. ఇన్‌స్పెక్టర్ అయిన తర్వాత అతని ఖర్చులు తగ్గాయే కాని పెరగలేదు. సంసారం పెరుగుతోందా అంటే అసలు సంసారమే లేదు. "వన్ వే ట్రాఫిక్" లా అతనికి రాబడేకాని ఖర్చు లేదు. తోటి ఇన్‌స్పెక్టర్లు కొందరు ఎంత డబ్బు తినేసినా వాళ్ళకు దరిద్రం తప్పడం లేదు. అందుకు కారణం పెరుగుతున్న సంసారాలు; పిల్లల పెళ్ళిళ్ళు; నిజాయితీగా బతకడానికి చాలని జీతాలు. ఇలాంటి పరిస్థితులలో తాను కొంచెం ఆగి చూడడం మంచిదనుకున్నాడు.

ఉద్యోగానికి సంబంధించిన వ్యవహారాలలో అతను సతమతమౌతున్నా, పెళ్ళిప్రయత్నం విడిచిపెట్టలేదు. ఉద్యోగాభివృద్ధికి కృషి, పెళ్ళి ప్రయత్నం జంట మార్గాలలో ప్రయాణం చేస్తున్నాయి. ఉద్యోగంలో కృషి ఎక్స్‌ప్రెస్ లా హైస్పీడులో పోతూవుంటే, పెళ్ళి వ్యవహారం

రెండెడ్ల బండిలాగ కునుకుతూ నడుస్తోంది.

బడి పంతుళ్ళలో కొంత మంది తీవ్రంగా ఆలోచించారు. "ఏమిటి? మన ఇన్‌స్పెక్టర్‌గారికి పెళ్ళి అవక పోవడం చాలా దారుణంగావుంది. మనిషిలోని గుణాలు చూద్దామా అంటే యితనికి డబ్బు తక్క ఏ వ్యసనమూ లేదు. వయస్సు చూద్దామా అంటే ముప్పై దాటి పోయింది. వెంటనే యితనికి




ఏదైనా సంబంధం చూడాల్సి చూడాలి! లేకపోతే తిరిగి దబుకి మీదికి చూపు మళ్ళించాడా! వచ్చామన్నమాట. మన మేలు కోసమైనా యితనికి పెళ్ళికావాలి!" ఒక నిర్ణయానికి వచ్చారు. భూమీ ఆకాశం తల్లకిందులు చేస్తున్నారు. విశ్వప్రయత్నాలు ప్రారంభించారు.

చివరకు యావన్మందినీ ఆశ్చర్య పరచే అపూర్వ సంఘటన జరిగింది. ఒక అందమైన చిన్నది బుచ్చిరాజును పెళ్ళిచేసుకోడానికి స్వయంగా అంగీకరించింది. దబ్బ పండులాంటి శరీరచ్ఛాయ, విశాలమైన కళ్ళు, పెద్దజుత్తు, సన్నంగా, పొడవుగా, లక్షణంగా వుంది. ఊర్వశిలాంటి చిన్నది బుచ్చిరాజును కోరి వరించడమా? ఇది కలా? నిజమా? ఇందులో కపటనాటకం యేమైనా వుందా? ఇంతకూ ఎవరాపిల్ల? ఏమా కథ?—యావన్మంది చూపులూ అవతల దిక్కుకు మళ్ళాయి.

## 2

మాణిక్యం నిజంగా మాణిక్యమే! చూపులకు చక్కనిది. చదువుకు సరస్వతి. తెలివికి బృహస్పతి. కాని ఏం లాభం? బ్రహ్మదేవుడిలో బ్రహ్మాండమైన లోటు యేదో వుండాలి! లేకపోతే మాణిక్యాన్ని పట్టుకొచ్చి మసిబొగ్గులలో వెయ్యడం ఏమిటి? ఇంతకూ మనది కర్మభూమి! పూర్వజన్మలో

చేసిన పాపాన్ని అనుసరించి యీ జన్మలో నరులు దరిద్రుల యిళ్ళలో పుడుతూ వుంటారట! కానీ కొన్ని సోషలిస్టు దేశాల్లో పుట్టుకనుబట్టి డబ్బూ రాదట! దరిద్రమూ రాదట! వాళ్ళు చేసే శ్రమనుబట్టి, తెలివి తేటలనుబట్టి డబ్బు వస్తుందట! మరి ఆ విదేశాలను బ్రహ్మదేవుడు తన పాలన లోంచి ఎందుకు వదిలేశాడో తెలియదు. ఇప్పుడు పరాయివాళ్ళ కథ యెందుకు?

అసలు కథలో కథానాయిక మాణిక్యం జాతక చక్రంలో గ్రహగతులు తెలుసుకోవడం అవసరమా? గ్రహాలచలనం తెలుసుకోడానికి ఆమెకు జాతకచక్రం అంటూ ఒకటి వుంటే కదా? మాణిక్యం జన్మించడానికి కొది రోజులుముందే ఆమె పితృగండంలో పుట్టినపిల్ల. ఇక వేరే తిథివార నక్షత్రాలెందుకు? జాతక చక్రం గీయించడం దేనికి? ఒక వేళ గీయిస్తే అందులో ఎన్ని గండాలు తగలడతాయో, ఎన్ని సుడిగుండాలుంటాయో ఎవరికి తెలుసు! కనక ఆమె జాతకం తెలుసుకోడానికి ఎవరూ సాహసించలేదు.

ఇంటి యజమాని పోవడంతో మధ్యతరగతి కుటుంబం, అడుగు తరగతి కుటుంబంగా మారిపోయింది. రాబడి పూర్తిగా పోయింది. ఖర్చులు మాత్రం తగ్గలేదు. మాణిక్యం తల్లి వంటమనిషిగా అవతారం మార్చింది. నారు పోసినవాడు నీరు పోస్తున్నాడు. మాణిక్యానికి ఒక అన్న, ఒక అక్క వున్నారు అన్న రెక్కలు కట్టుకొని ఎగిరి పోయి పడమటి దిక్కున ఉద్యోగం చేసుకు బ్రతుకుతున్నాడు. అక్క తూర్పు దిక్కున భర్తతో కాపురం చేసుకుంటోంది.

> తను చేసిన తప్పుకి మేనేజరు తిడతాడేమోనని తెగభయపడిపోతున్న ఒక గుమాస్తాతో మరొక గుమాస్తా :
>
> "అది కాదోయ్. సరాసరి దర్జాగా మేనేజరు దగ్గిరికెళ్ళి జరిగింది జరగనట్టు అంతా చెప్పేయక పోయావా?"

ఇప్పుడు యే దిక్కూ లేనివాళ్లు తనూ తన తల్లీను. తల్లి వంట్లో ఓపిక పోయింది. వంటమనిషి వృత్తి నుంచి తప్పుకొంది. కాదు కాదు, తప్పించబడింది.

తల్లీ, కూతురూ విధిలేక వీధిని పడ్డారు రెండోసారి. మరోమార్గం లేక పడమటి దిక్కుకు ప్రయాణం అయ్యారు. తల్లిని పోషించవలసిన బాధ్యత కొడుకుది. కొడుకు తన బాధ్యత స్వీకరించాడు. తల్లిని, చెల్లెల్ని చేరదీశాడు. ఆదరించాడు.

అతని కుటుంబంలో యిద్దరు సభ్యులు పెరిగారు. ఆదాయం పెరగలేదు. పాత అలవాట్లు మానుకోవాలి. ఇంతవరకూ చేస్తూ వచ్చిన ఖర్చులు తగ్గించుకోవాలి. ఎన్నో యిబ్బందులు పడాలి. నెలలు గడుస్తున్నకొద్దీ కొడుక్కు చిరాకు హెచ్చింది. కోడలి కోపం తారాస్థాయి చేరుకొంది.

తరవాత మాణిక్యం తన తల్లితో తూర్పు దిక్కుకు బయలు దేరింది. అన్నగారు అప్పుచేసి యిచ్చిన రైలు ఛార్జీలు 'అకంగు' వరకూ చాలలేదు. ముందు స్టేషన్‌లో దిగి పదిహేను మైళ్ళు నడిచి అక్కగారి యిల్లు చేరు





కొన్నారు. అక్కా బావా ఆదరించారు. తల్లి పెద్దకూతుర్ని చూసి భోరున యేడ్చింది. "మీ నాన్న వుంటే నాకీ కష్టాలు వుండేవా? ఇంకా ఎన్నిబాధలు పడాలో, ఆ దేవుడు ఆయనకు బదులు నన్నైనా తీసుకుపోయాడు కాదు" అంది తల్లి.

ఏడ్పులూ, ఓదార్పులూ ముగిసి జీవితం మామూలు బాటలో సాగుతోంది. మాణిక్యానికి అక్కగారి యింట్లో పరిస్థితి నచ్చింది. బావగారికి కూడా ఆదాయం తక్కువే. అయినా కుటుంబ నిర్వహణలో అతనికి నేర్పువుంది. ఊళ్ళో కొంచిగా పలుకుబడి వుంది. మనిషి మంచివాడు. ఎప్పుడూ నవ్వుతూ సరదాగా వుంటాడు బావతో పల్చి చూసినప్పుడు అక్కకే కోపం, చిరాకు ఎక్కువ.

వాళ్ళకు యిద్దరు పిల్లలు. చాలీ చాలని జీతం. దానికితోడు మరో యిద్దరు కొత్తగా వచ్చి కలిశారు. బావగారు యిబ్బందులను సంతోషంతో ఎదుర్కొన్నాడు. తీరిక సమయంలో ఒక పెద్ద షాపులో ఎకౌంట్లు రాయడానికి ఒప్పుకున్నాడు. యాభై రూపాయలు అదనపు రాబడి. దానితో పెరిగిన కుటుంబానికి ఖర్చులు బొటాబొటీగా సరిపోతున్నాయి.

బావగారి తెలివితేటల్ని, మంచిని మనసులోనే మెచ్చుకొంది మాణిక్యం. బావకు అందం వుంది.

తెలివి వుంది. మాట నేర్పు వుంది. డబ్బు లేదు. "డబ్బు కూడా వుంటే ఎంతరాణించే వాడో కదా!" అనుకొంది



మాణిక్యం ఇప్పుడు నవయౌవనంలో వుంది. విరిసిన గులాబీ చుట్టూ తుమ్మెదలు తిరుగుతున్నాయి. ఒకసారి చూచినవాళ్ళు ఆమెనుంచి చూపులను మళ్ళించుకోలేక పోతున్నారు. "దరిద్రులకు అందం ఎందుకిస్తాడో దేవుడు! వాళ్ళను యింకా ఎక్కువ కష్టాలలో పెట్టడానికా?" అనుకొంది అక్క.

ఈ మధ్యకాలంలో కొన్ని అవాంతరాలు వచ్చాయి. మధ్యతరగతి వాళ్ళ జీవితాలు వున్నాయి చూశారూ! ఏ మాత్రం బేలన్సు తప్పినా ప్రమాదమే! సర్కస్‌లో తీగమీద నడిచేవాడికి మిల్లీ మీటర్ బేలన్సు తప్పితేచాలు – నేలమీద పడవలసిందే! 'మాణిక్యం అక్క' ఘోషా హాస్పిటల్‌లో మూడవ పురుడు పోసుకుంది. పురిటి ఖర్చులు వంద దాటిపోయాయి! ప్రసవించిన నాలుగో రోజున చిన్న జ్వరం వచ్చింది. అది పెద్ద జ్వరంగా, జబ్బుగా మారిపోయింది ఖర్చులు! ఖర్చుల బాధభరించలేక పోయాడు. మంచితనం వల్ల అప్పు సంపాదించాడు. దానికూడా ఒక హద్దు అంటూ వుంటుందికదా! మహాపట్నంలో అప్పుపుట్టడం మాటలు కాదు. అతని గెడ్డం మాసిపోయింది. కళ్ళు లోపలికి పోయాయి పెదాల మీద మందహాసం శుష్కించిపోయింది. ఒకవేళ చిరునవ్వు కనిపిస్తే-అది యేడవలేక నవ్వే చిరునవ్వు! "అహా! ఈ ప్రపంచంలో డబ్బుకెంత మాహాత్మ్యం వుంది!" మరోసారి ఆశ్చర్యపోయింది మాణిక్యం. బావ స్థితికి జాలిపడింది. తనప్రాణాలు ధారపోసి అయినా బావకు సాయపడాలి అనుకొంది. కానీ...తనెంత నిస్సహాయురాలు!

చివరకు అక్కకు చావు తప్పింది. కళ్ళు లోపలికి పోయాయి శుష్కించిన దేహంతో యిల్లు చేరుకొంది. ఇంటిల్లిపాదీ సంతోషించారు. ఆమె నెమ్మదిగా కోలుకుంటోంది. చేసిన అప్పు బ్రహ్మరాక్షసిలా కనిపిస్తోంది. తక్కువ వాయిదాలలో తీర్చడానికి ప్రయత్నిస్తున్నాడు. కానీ ఆ సొమ్ము వడ్డీకే చాలడం లేదు. అసలు అసలుగానే వుంది.

వడ్డీ తీరుతోంది. కష్టపడి చెమటోడ్చి యిస్తున్న డబ్బు వడ్డీలో కలుస్తోంది.

ఆ సమయంలో మాణిక్యానికి ఒక మంచి సంబంధం వచ్చింది. కుర్రాడు సన్నగా, నాజూగ్గా వున్నాడు. పిల్లను చూసి మోజుపడి తన తరపు పెద్దల్ని పంపించాడు. కట్నం వద్దన్నాడు. ఈ సంబంధం మాణిక్యం తల్లికి, అక్కకూ, బావకూ కూడా నచ్చింది. బావ మాణిక్యాన్ని అడిగాడు.

"మాణిక్యం! కుర్రాణ్ణి చూశావు కదా! ఎలా వున్నాడు?"

"బాగానే వున్నాడు."

"మరి ఈ సంబంధం నిశ్చయించమంటావా?"

"వాళ్ళకు డబ్బు వుందా?"

"లేదు."

"ఆస్తికాని, అతనికి ఉద్యోగం కాని వుందా?"

"ఆస్తిలేదు. కానీ ఉద్యోగం దొరక్కపోదు."

"అయితే వద్దు!"

ఆశ్చర్యపోయాడు బావ! "ఏమిటి మాణిక్యం! డబ్బూ, ఆస్తీ వున్నవాడు కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటాడా?"

"చేసుకోకపోతే పోనివ్వండి! ఇలాగే వుండిపోతాను."

ఓహో! మాణిక్యం తన పెళ్ళి గురించి యిదివరకే ఒక నిర్ణయానికి వచ్చిందన్నమాట! అనుకున్నాడు బావ. ఇక యెవరూ ఆమె దగ్గర ఆ ప్రసక్తి తీసుకు రాలేదు.

ఒకసారి వాళ్ళింటికి ఒక దూరపు బంధువు వచ్చాడు. అతను ఎలి మెంటరీ స్కూలు టీచరు. అతనికి పట్నంలో యేదో పని వుందట! వాళ్ళ ఇన్‌స్పెక్టరుగారు పైఆఫీసుకు సిఫార్సు ఉత్తరం యిచ్చారట! ఆ ఉత్తరం పట్టుకు వచ్చాడు. వాళ్ళింట్లోనే దిగాడు. మాణిక్యాన్ని చూడగానే అతనికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

"ఆహా! పిల్ల ముఖంలో లక్ష్మీ కళ వుంది" అందరికీ వినపడేలా మెచ్చుకున్నాడు. ప్రశ్నమీద ప్రశ్న వేస్తూ సమాచారం రాబట్టుతున్నాడు. వాళ్ళ స్థితిగతులూ, బలహీనతలు, యిబ్బందులూ గ్రహించాడు. ఆ రాత్రి తాంబూలం సేవించి యింటి యజమానితో తీరిగ్గా మాట్లాడాడు.

"చూడు నాయనా! మాణిక్యం ధనరాసుల మధ్య తిరగవలసినపిల్ల! ఆమె చేతిలో అదృష్టం వుంది. అర చేతిలో ధనరేఖ వుంది. నాకు తెలిసిన సంబంధం ఒకటి వుంది. చాలా గొప్ప సంబంధం!"

"గొప్ప సంబంధమైతే మేం తూగగలమా? — కట్నం యిచ్చుకోలేం."

"కట్నం లేకుండా కుదుర్చుతాను."

"రెండో పెళ్లివాడేమిటి ?"

"ఛ! ఛ! మొదటి పెళ్లివాడే! పరాయివాడు కాదు! మా స్కూళ్ళ ఇన్స్పెక్టరుగారు! మన శాఖ అవడం నిజంగా మన అదృష్టం అనుకో!"

"ఆస్తీ, డబ్బూ యేమైనా వున్నాయా ?"

"ఆస్తిలేదు. కాని డబ్బు మాత్రం పుష్కలంగా వుంది. ఎంతలేదన్నా పదివేలకు తక్కువ వుండదు. నెలకు రెండువందల పాతిక జీతం! జీతం కాక సంవత్సరానికి నికరాదాయం రెండువేల పైచిలుకు! తన పేరున యిల్లూ వాకిలి, పొలం పుట్రాకొంటే చిక్కులొస్తాయని ఆగిపోయాడు. పెళ్లి కాగానే పెళ్ళాం పేరుమీద కొనాలని అతని అభిప్రాయం."

మాణిక్యం కళ్ళు ఆశతో మెరిశాయి. మాస్టారుకేసి చూసింది. బావ పరిస్థితి గ్రహించాడు.

"మాణిక్యం యిష్టమే మా ఇష్టం" అన్నాడు.

"అహ! అలా అనకు నాయనా!" అడ్డుపడ్డాడు పంతులు.

"ఈ కాలపు ఆడపిల్లలు ఎర్రగా అందంగా పైపై మెరుగులున్న వాళ్ళను చూసి యిష్టపడతారు. కానీ పదికాలాలపాటు బ్రతుకు బాగుండాలని కోరుకోరు ముందే చెప్పడం మంచిది. పెళ్లికొడుకు పెద్ద అందగాడు కాదు. సంసారపక్షంలో వుంటాడు. స్థూలకాయుడు. అదే అతని ఆకారంలో లోపం. తెలివితేటల్లో గానీ, మాట తీరులో గాని, చురుకుతనంలో గాని ఆవగింజంత లోపైనా లేదు. నా మాట విని పిల్లమీద భారం వెయ్యకుండా, ఆమె మేలుకోరి నీ అంతట నువ్వే ఈ సంబంధానికి ఒప్పుకోవాలి!"

చివరకు ఓ శుభముహూర్తంలో

---

మాసిన గడ్డం, మాసికల బట్టలతో ఒకడు కాఫీ హొటల్లోకి అదరా బాదరా వచ్చి కూర్చుంటూ: "సర్వర్! ఇంకో అయిదు నిమిషాల్లో ఇక్కడ పెద్ద గలాటా జరగబోతోంది. త్వరగా మసాల దోసె తీసుకురా" అన్నాడు.

సర్వర్ గబగబా మసాలాదోసె తీసుకొచ్చాడు. అది తిన్నాక "ఇంకా రెండు నిమిషాలే వుంది గలాటాకి, చప్పున కాఫీ తీసుకురా."

సర్వర్ కాఫీ తీసుకువచ్చి "ఏం గలాటా, సార్ ?" అన్నాడు. ఆసామీ కాఫీ గడగడ తాగేసి "నా దగ్గర డబ్బులు లే"వన్నాడు.

---

పెళ్ళికొడుకును రప్పించడం జరిగింది. గజగమనంతో గదిలో అడుగు పెడు తున్న పెళ్లికొడుకును చూడగానే 'బావ' మూర్ఛపోయినంత పని చేశాడు. ఉత్తర క్షణంలోనే వద్దని చెప్పడం మర్యాద కాదని వూరు కున్నాడు.

కూర్చోమని మర్యాద చెయ్య డానికి వెంటనే వీలు లేక పోయింది. అతనికి సరిపోయే కుర్చీకోసం వెతి కారు. చేతులు లేనికుర్చీ వెతికి తెచ్చే సరికి కొంత ఆలస్య మయింది. పరీక్షా ఫలితాలు చూడ్డానికి పేపరు పట్టుకొన్న కుర్రవాడిలా భయ పడుతూ కూర్చున్నాడు బుచ్చిరాజు.


హెడన్సా




మూల వ్యాధులకు

ప్రతిచోట దొరకును

DZ-982A TEL


గ్లాసుకాఫీ ఒక గుక్కలో తాగే శాడు. బుచ్చిరాజు తరపున మాస్టారు మాట్లాడుతున్నాడు.

'మాణిక్యం ఇష్టమే మా ఇష్టం!' నొక్కి చెప్పాడు బావ.

'మేం తరవాత కబురు పంపిస్తాం లెండి' అంది అక్క.

పంతులు జీడిలా పట్టుకొని వద ల్లేదు.

'వాయిదాలు వద్దు ముందుకూ వెనక్కి వూగిసలాట మంచిదికాదు. ఈ ముహూర్తం మంచిది. ఈ క్షణం లోనే మీరు ఔననడం ఉభయ పక్షాలకూ మంచిది. బంగారంలాంటి సంబంధం! ఏ ఇబ్బందులూ లేకుండా పిల్ల జీవితంలో సుఖ పడుతుంది. పిల్ల క్షేమంకోరి మీరు ఈ సంబంధానికి ఒప్పుకోవాలి!' అన్నాడు.

ఇక విధిలేక బావ మాణిక్యాన్ని పిలిచాడు. మాణిక్యం వచ్చింది. మాణిక్యాన్ని చూడగానే పెళ్ళి కొడుక్కి ముచ్చెమటలు పట్టాయి. ఇలాంటి అపురూప సుందరి ఒప్పు కుంటుందా?

బావ చెబుతున్నాడు 'మాణిక్యం! సిగ్గు పడకుండా చూడు! నిర్భ యంగా చెప్పు! నీకు ఈ సంబంధం నచ్చిందా?'

తనకు మొహమాటంగాని మాణి క్యానికి మొహమాటం యేమిటి? వద్దని ఖచ్చితంగా ముక్కుమీద

సొద్దికట్టు చెబుతుంది. తనకు నిష్కారం తప్పుతుంది అనుకున్నాడు బావ.

మాణిక్యం సిగ్గుపడలేదు. భయపడలేదు. పెళ్లికొడుకును పరిశీలనగా చూసింది.

"ఇష్టమే!" అంది మాణిక్యం.

బావ తన చెవుల్ని తానునమ్మలేకపోయాడు. బడిపంతులు తన చెవిని పడ్డ మాట "ఇష్టమా? అయిష్టమా?" అన్న మీమాంసలో పడ్డాడు.

"అమ్మాయ్! నువ్వీ సంబంధం ఒప్పుకుంటున్నట్టేనా?" రెట్టించి అడిగాడు పంతులు.

"ఒప్పుకుంటున్నాను" స్పష్టంగా చెప్పింది మాణిక్యం.

చీకటితో నిండిపోయిన బుచ్చిరాజు అంతరాంతరాలలో వెయ్యి దీపాలు ఒక్కసారిగా వెలిగాయి. "ఈ పిల్లని తప్పకుండా పువ్వుల్లో పెట్టి పూజిస్తాను. పట్టుచీరలు, వెండి, బంగారం, రూపాయలు అన్నీ కలబోసి ఈమెకు తులాభారం చేయిస్తాను. సన్నగా వుంది కనక ఎక్కువ తూగదు కూడా!" బుచ్చిరాజు సంతోషానికి పట్టపగ్గాలు లేకపోయాయి.

పెళ్ళయిన నాలుగోరోజున పెళ్ళికొడుకు నవవధువును సినిమాకి తీసికెళ్ళాడు. బుకింగ్ ఆఫీసు వద్ద పరధ్యాన్నంగా "బాల్కనీకి ఒక టికెట్ ఇవ్వండి" అని అడిగాడు.

కొత్త పెళ్ళికూతురు సిగ్గుపడుతూ "ఒక టిక్కెట్టే తీసుకుంటున్నారేం?" అని అడిగింది.

పెళ్ళికొడుకు నాలిక్కరుచుకుని "బలే బలే. నీ గురించే ఆలోచిస్తూ నా సంగతి మర్చేపోయాను" అన్నాడు తడుముకోకుండా.

## 3

ఓ శుభముహూర్తంలో బుచ్చిరాజు సతీసమేతంగా గృహప్రవేశం చేశాడు. నవ్వినవాపచేను పండింది. అతని ప్రత్యర్థులందరికీ ఘోర పరాజయం కలిగింది.

పూర్వం మార్కండేయుడు స్వంత ప్రతిభవల్ల మృత్యువును జయించాడట. ఈనాడు మాణిక్యం తన స్వీయ ప్రతిభవల్ల దరిద్రాన్ని జయించింది. తన పేరు సార్థకం చేసుకొంది. స్వల్పకాలంలోనే భర్తలోని బలహీనతలన్నీ కనిపెట్టింది. అతను ఉద్యోగ వ్యవహారాలలో తప్ప మిగిలిన వాటిలో తెలివైనవాడు కాదని గ్రహించిందామె. స్వల్పకాలంలోనే


ఆ యింటికి—సంపూర్ణమైన యజమానురాలుగా మారి కూర్చుంది. అతని సంపాదన యావత్తూ ఆమె చేతికి చేరవలసిందే! ఖర్చులన్నీ ఆమె చేతి మీదుగా జరగవలసిందే! నెలకోసారి అక్కగారి యింటికి వెళుతోంది. తన తల్లికి అయ్యే ఖర్చులన్నీ తనే రహస్యంగా భరిస్తోంది. బావకుకూడా లోపాయికారీగా యిబ్బందులలో సాయ పడుతోంది. తల్లి తన దగ్గర వుండే కంటే అక్క దగ్గర వుండడమే శ్రేయస్కరం. తల్లి వంకతో అక్కడికి రావచ్చు. ఎక్కువ సహాయం చెయ్యొచ్చు. మాణిక్యం నివురుగప్పిన నిప్పు అన్న సంగతి బావ యింతకాలానికిగానీ గ్రహించలేక పోయాడు.

మూల ధనంలో సగానికి పైగా తరిగిపోయింది బుచ్చిరాజుకు! అదనపు రాబడి — రేటు పెంచకపోతే లాభంలేదు. పెంచితే అందరూ గోల చేస్తారు. వాళ్ళంతా తనకు యింతో అంతో ఉపకారం చేసినవాళ్ళు. అలా అని వూరుకుంటే అతని కోరిక తీరదు. మాణిక్యం అంటే అతనికి ప్రాణం. ఆమెను అద్దె కొంపలో వుంచడం అతనికి యిష్టంలేదు. ఇల్లు కావాలి. అందుకు డబ్బు కావాలి. ఆదాయం పెంచుకోక తప్పదు. పై ఆఫీసుకు వెళ్ళాడు. పలుగుర్ని పట్టుకున్నాడు. మరో తాలూకాకు బదిలీ చేయించుకున్నాడు. మాటులో పొంచి కూర్చున్న వేటగాడిలా మూణ్ణెల్లు అనూ పానూ కనిపెట్టాడు. 'ఈ తాలూకాలో బంగారం పండించొచ్చు' అని గ్రహించాడు.

ఆ తాలూకాలో ప్రైవేటు స్కూళ్ళు చాలా వున్నాయి. కొన్ని స్కూళ్ళలో పన్నెండుగురు టీచర్లు పని చేస్తున్నట్టు రికార్డులు చూపిస్తున్నాయి. పన్నెండుగురికీ జీతాలు లెక్కకట్టి మేనేజరుకు యిస్తున్నారు. తీరా అక్కడికి వెళ్ళి చూస్తే ఆరుగురు టీచర్లు కూడా కనపడ్డంలేదు. నలుగురు టీచర్లు లేనే లేరు. వాళ్ళ సర్టిఫికేట్లు మాత్రం మేనేజరు దగ్గర వున్నాయి. మరో యిద్దరు టీచర్లు అవాంతర పరిస్థితుల్లో తప్ప రానే రారు. ఇక నెల అంతా కష్టపడి చదువుచెప్పే నలుగురు టీచర్లకైనా ఆ మేనేజరు పూర్తి జీతం యివ్వడం లేదు. ప్రతి టీచరు జీతంలోంచి నెలకు పదో, పదిహేనో కోసేస్తూ వుంటాడు. 'ఎక్విటెన్స్ రోల్సు' మాత్రం పరిశుభ్రంగా వుంటాయి. పైసా తకరా లేకుండా — పైవాళ్ళు యిచ్చిన జీతాలన్నీ సక్రమంగా టీచర్లకు అందజేసినట్టు రికార్డులో కనిపిస్తుంది. మేనేజరు నెలకు "ఏవరేజిని' నాలుగు వందల చొప్పున తినేస్తున్నాడు. ఇలాంటి స్కూళ్ళు ఆ తాలూకాలో పది వున్నాయి. బుచ్చిరాజు వెంటనే వాటిమీద దండయాత్ర సాగించాడు. మేనేజర్లు రహస్యంగా బుచ్చిరాజును కలుసు

కు న్నా రు. "నే ను అలాంటి బా వ తు కాదు" అ న్నా డు ముందు.

"బాబ్బాబు! అలా అంటే చచ్చిపోతాం. ఈ మహావృక్షాన్ని ఆశ్ర యించుకొని ఏనాటి నుంచో బ తు కు తున్నాం. వెనకటాయ నకు యి చ్చి న మా మూ ళ్ళు త మ కూ




సమర్పించు కు ం టా ం" అన్నారు. ఆ అంతె చెప్పారు.

బుచ్చిరాజు బిగ్గరగా నవ్వాడు. "అరే! నన్నే దగా చే ద్దా మ ను కుంటున్నారే! మీరుఒక్కొక్కళ్ళూ తి నే స్తు న్న సొమ్ము, పేరుపేరునా టూ పా య లా పై స ల తో రాసి వుంచాను. ఇదుగో చూసుకోండి" తను తయారుచేసిన ప్రై వే టు రికార్డు వాళ్ళకు యిచ్చాడు. అది చూసేసరికి వాళ్ళకు గుండె ఆగి నంతపని జరిగింది.

"అహా! వీడెవడో గుండెల్తీసిన బంటులాగ వున్నాడు. పైసాఅయినా తకరా లేకుండా మన రాబడి అంతా లెక్కకట్టేశాడు. వీడిమీద పిటీషన్ను పె ట్ట డ మా ? ట్రా న్స్ ఫ ర్ చేయించడమా? తన్నించడమా? లేకపోతే డబ్బెక్కువ ముట్టజెప్పి లొ ం గ ది య్య డ మా ?" అని మేనేజర్లలో ముఖ్యమైన వాళ్ళంతా ఆలోచించారు.

"లోగడ మంచినీళ్ళయినా తాగని ఇన్స్పెక్టర్ ఒకడు వ చ్చా డు. పై ఆఫీసు వాళ్ళని కూడగట్టుకొని, అతగాడికి ఉద్యోగం పోయేదాకా తీసుకువచ్చాం. ఇల ంటి తగాయిదా లెక్కువ తేవడం మనకీ మంచిదికాదు. చి వ రి ప ద్ధ తి ఉభయతా రకంగా వుంటుంది. డబ్బు ఎక్కువ ముట్ట చె బు దా ం. తప్పకుండా పుచ్చు కుంటాడు. ఎ ప్పు డో అవకాశం వచ్చినప్పుడు నొ క్కే ద్దా ం—" అ న్నా రు అ ం దు లో కొందరు అనుభవజ్ఞులు.

చివరకు మేనేజర్లకూ, బుచ్చి రాజుకూ, రాజీ కుదిరింది. అతని రాబడి రెట్టింపయింది. అ త ను ఇన్స్పెక్షన్ రి పో ర్టు లు రా సే పద్ధతిలోకూడా కొత్త టె క్ని క్ కనిపెట్టాడు. మేనేజరుకు "మేనేజి మెం టు గ్రా ం టు" రూపంలో ఎక్కువ డబ్బు సిఫార్సు చెయ్య

దానికి వీలుగా ఇన్‌స్పెక్షన్ రిపోర్టు తయారుచేస్తున్నాడు.

బుచ్చిరాజు తనిఖీ చేసిన ఒక ఎలిమెంటరీ స్కూలును ఒకసారి పై అధికారి తిరిగి తనిఖీ చేశాడు. బుచ్చిరాజు రాసిన ఇన్‌స్పెక్షన్ రిపోర్టుకు అక్కడవున్న పరిస్థితికి ఎక్కడా పోలిక లేదు. పై అధికారి బుచ్చిరాజును నిలదీసి అడిగాడు.

"ఏమిటోయ్ బుచ్చిరాజు! ఇలా రా! ఈ ఇన్‌స్పెక్షన్ రిపోర్టులో నువ్వేం రాశావో చూడు! ఎనిమిది బ్లాక్ బోర్డు లన్నావు. ఎందుకూ పనికి రానివి యిదిగో రెండు వున్నాయి. టేబుల్సూ, కుర్చీలూ వున్నట్టు రాశావు. ఏవీ ఎక్కడ వున్నాయి? కిండర్‌గార్డెన్ బల్లలు ఇరవై నాలుగు వున్నాయని రాశావు. కానీ కుర్రాళ్ళు కూర్చోడానికి చింకిచాపలు కూడా లేవు. టీచర్లు పన్నెండుగు రన్నావు! నలుగురే కనపడుతున్నారు. పిల్లలు నాలుగు వందలన్నావు! వందమంది


మయూర పింఛంకంటె
మనోహరమైన
కేశపాశం కావాలంటే
కేశవర్ధిని
వాడండి
మీ శిరోజాలను పరిశుభ్రంగా, పరిమళభరితంగా
ఉంచుకొనడానికి ఉపయోగించవలసింది
కేశవర్ధిని షాంపూ

కూడా లేరు. నువ్వు మేనేజర్లతో లాలూచీపడి పై వాళ్ళను దగా చేస్తున్నావు! నీ మీద ఎందుకు చర్య తీసుకోకూడదో సంజాయిషీ చెప్పు" అధికారి కోపం తారస్థాయికి పోయింది.

బుచ్చిరాజు ఏ మాత్రం తొణక్కుండా జవాబు చెప్పాడు. "అయ్యా! నేను ఇన్స్పెక్షన్ చేసిన రోజున బల్లలు, కుర్చీలు అన్నీ వున్నాయి అవి ఎక్కడనుంచైనా ప్రత్యేకంగా తెచ్చి వేశారో—మరేం చేశారో తెలియదు. ఆ రోజున పిల్లలూ వున్నారు. పంతుళ్లూ వున్నారు. నిజంగా నా కళ్ళతో అవన్నీ చూసే రాశాను. ఆ తరవాత మీ దయ!"

అధికారికి ఈ జవాబు సంతృప్తికరంగా లేదు. కోపంతో వెళ్ళిపోయాడు. బుచ్చిరాజుకు పై ఆఫీసు నుంచి సంజాయిషీ నోటీసు వచ్చింది. సదరు మేనేజరుకు బుచ్చిరాజు తిరిగి సంజాయిషీ నోటీసు యిచ్చాడు. స్కూలు మేనేజరు తన సంజాయిషీలో ఈ విధంగా రాశాడు.

"అయ్యా! తమరు మా స్కూలుకు వేంచేసిన రోజున మా వూరి పంచాయతీ బోర్డు ప్రెసిడెంటుగారి యింట్లో శుభకార్యము జరిగినది. అందుకొరకు వారు కోరగా ప్రెసిడెంటుగారి మాట కాదనలేక, బల్లలు కుర్చీలు వగైరా స్కూలు సామగ్రి అంతా వారి యింటికి తరలించడమైనది. దీనిని ధ్రువపరుస్తూ ప్రెసిడెంటుగారు యిచ్చిన ఉత్తరం నకలు దీనికి జతపరచడమైనది. బ్లాక్ బోర్డులు మరామత్తు చేయుటకు పంపబడినవి.

ఆ రోజునే మా గ్రామంలో అమ్మవారి పండుగ జరుగుచున్నందువల్ల, పిల్లలు చాలామంది అక్కడికి వెళ్ళుటవలన బడికి హాజరు తగ్గినదని మనవి చేసుకుంటున్నాను. పిల్లలు రానందువల్ల ఉపాధ్యాయులు తమ స్వంత పనులకొరకు ఆ రోజున సెలవు పెట్టుకొనుట జరిగినది. గ్రామ పండుగను ధ్రువపరుస్తూ గ్రామ మునసబుగారు యిచ్చిన ఉత్తరం నకలు దీనికి జతపరచడమైనది."

ఏమైతేనేం చివరకు కేసు కొట్టేశారు. స్కూలు మేనేజరు మీద, ఇన్స్పెక్టరు మీద పెట్టిన చార్జీస్ని డిపార్టుమెంటు వాళ్ళు రద్దు చేసుకున్నారు. దీనితో బుచ్చిరాజు పరపతి పెరిగి పోయింది.

"ఏమి తెలివి? ఎటొచ్చీ కొంచెం కడుపు పెద్దది" అనుకున్నారు స్కూళ్ళ యజమానులు.

ఆ సంవత్సరమే పట్నంలో ఒక చిన్న యిల్లు ఆరు వేలకు కొని మాణిక్యం పేరున రిజిష్టర్ చేయించాడు.

ఈ ప్రపంచం వుంది చూశారూ? ఎంతమంది జ్యోతిష్కులున్నా యే

క్షణానికి యేం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. మంచివాళ్ళైనా, చెడ్డవాళ్ళైనా కొన్ని అవాంతరాలను ఎదుర్కోక తప్పదు.

పై అధికారుల బుర్రలలో ఒక బుద్ధి పుట్టింది. వెంటనే శాసనం చేశారు. అమలులో పెట్టేశారు. ప్రైవేటు మేనేజిమెంట్ కింద వున్న ఎలిమెంటరీ స్కూళ్ళన్నీ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఎన్ని స్కూళ్ళున్నాయో, ఎంతమంది ఉపాధ్యాయులున్నారో, వాటి నిర్వహణకు ఎంత డబ్బు అవుతుందో, లెక్కలు తయారు చెయ్యమని ఇన్‌స్పెక్టర్లకు తాఖీదులు వచ్చాయి.

బుచ్చిరాజుకు నడుం విరిగినంత పని జరిగింది. ఒక రోజంతా యింట్లోంచి పైకి రాలేదు. మేనేజర్లలో ముఖ్యులంతా విచార సాగరంలో మునిగిపోయి బుచ్చిరాజు ఇంటి అరుగు మీద కూర్చున్నారు. బుచ్చిరాజును వాళ్లు ప్రార్థించారు.

"మీరు బుద్ధికి బృహస్పతి! ఆ రూల్సు అన్నీ బాగా వెతికి చూడండి. అందులో అరంగుళం సందైనా వుంటే చాలు, చెప్పండి. మేం యావన్మందీ అందులోంచి దూరిపోడానికి ప్రయత్నిస్తాం. మా స్కూళ్ళన్నీ పోయాయంటే మా ఒక్క పక్షమే నష్టపోదు. మాతోపాటు మీరు, మీ పై ఆఫీసులో మా సీట్లు చూసేవాళ్ళు అంతా నష్టపోతారు. శీఘ్రమే ఆలోచించండి."

"ఆలోచించాను. సందు లేక పోలేదు" అన్నాడు నీరసంగా బుచ్చిరాజు.

"చెప్పండి! చెప్పండి! అదేమిటో?" ఆత్రుతతో అడిగారు యజమానులు.

"పేచీలు, కంప్లయింట్లు, ఇర్రెగ్యులారిటీలు, తగాయిదాలు లేని స్కూళ్ళను జాబితాలోంచి మినహాయించవచ్చు" అన్నాడు.

"మా స్కూళ్ళన్నీ అద్భుతమైన స్కూళ్ళనీ, ఆదర్శ ప్రాయులైన మేనేజర్లనీ రాయించండి. మీరేం కావాలంటే అది యిచ్చుకుంటాం! బతికున్నంతకాలం మిమ్మల్ని మెచ్చుకుంటాం" ప్రాధేయ పడ్డారు మేనేజర్లు.

మొత్తానికి రాజీ కుదిరింది. బుచ్చిరాజు పైకి రాసేశాడు. తన రేంజిలో అద్భుతమైన స్కూళ్ళు ముప్ఫైరెండు వున్నాయనీ, వాటిని ముట్టుకోడానికి కూడా వీల్లేదని, రాజకీయవేత్తల సర్టిఫికెట్లతోను, గ్రామస్థుల మహజర్లతోను పై అధికారులకు రిపోర్టు పంపించాడు.

బుచ్చిరాజు తనముందు జరుగుతున్న కథ మాత్రమే చూస్తున్నాడు. తన వెనక జరుగుతున్న గ్రంథం తెలుసుకోలేక పోయాడు.

ప్రైవేటు మేనేజిమెంట్లు రద్దు చేస్తారని తెలిసినప్పటినుంచీ ఉపాధ్యాయులంతా అమితానంద భరితులై వున్నారు. రేపటినుంచి నిండుజీతం దొరుకుతుందని ఆశపడుతున్నారు. మేనేజర్లు చెయ్యమన్న ఫోర్జరీ పనులన్నీ తప్పుతాయని సంతోషిస్తున్నారు. మూడు నెలల నోటీసు యిచ్చి ఉద్యోగం తీయించి వేస్తారన్న భయం తొలగిపోతున్నందుకు ఆనందిస్తున్నారు. మేనేజర్లు, టీచర్లు బాహాటంగా రెండుపక్షాలుగా చీలిపోయారు. ఉపాధ్యాయులు ధైర్యంగా మేనేజర్లకు ఎదురు తిరిగి జవాబు చెప్పగలుగుతున్నారు.

అలాంటి సంతోష సమయంలో బుచ్చిరాజు ప్రైవేటు మేనేజిమెంట్లకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నాడన్న వార్త ఉపాధ్యాయుల చెవిని పిడుగులా పడింది. వెంటనే లేచారు. వలుగుర్నీ కూడగట్టుకున్నారు. వడుం బిగించారు. ఒక్కొక్క మేనేజరు చేసిన అకృత్యాలన్నీ గుచ్చి గుచ్చి రాశారు.

బుచ్చిరాజు మేనేజర్ల పక్షం వహించడంలో గల అతి రహస్యం బయట పెట్టారు. బహిరంగ లేఖలు, ఆకాశరామన్న అర్జీలు, మహజర్లు, పిటీషన్లపై అధికారులమీద వర్షంలా కురిపించారు. హైద్రాబాద్, ఢిల్లీ నగరాలకు కూడా మహజర్లు వెళ్ళాయి.

'తల్లి పుట్టిల్లు మేనమామకు ఎరుక' అన్నారు. అలాగే మేనేజర్ల గోత్రాలు టీచర్లకు సంపూర్ణంగా తెలుసు. వాళ్ళు మహజర్లలో రాసిన సంగతులన్నీ ధ్రువపడ్డాయి.

నెల రోజులు తిరక్కముందే పై అధికారులు బుచ్చిరాజును శంకరగిరి మన్యాలు పట్టించారు. అద్దానవు అడివిలో ఆకూ అలమూ తప్ప మరేమీ దొరకని కుగ్రామానికి బదిలీచేశారు. అలాంటి సమయంలో సెలవు పెట్టడం నేరం అవుతుంది.

ఇంగ్లీషు మేష్టారు ఫస్టుఫారంకుర్రాళ్లకి పాఠం చెబుతున్నాడు:

'పెళ్ళిఅయిన స్త్రీని మిసెస్ అంటారు. పెళ్ళికాని స్త్రీని మిస్ అంటారు. మగవాళ్ళైతే మిస్టర్ అంటారు. తెలిసిందా?'

'తెలిసిందండి' అన్నారు కుర్రాళ్ళు. వాళ్ళలో కొంచెం పరధ్యాన్నంగా వింటున్నట్టు కనబడిన కుర్రాణ్ణి పిలిచి 'ఒరే, రామూ! ఇప్పుడు చెప్పు. మిసెస్‌కి, మిస్‌కి తేడా ఏమిటి?' అని మేష్టారడిగాడు.

రాముూ: మిస్టర్ అండి.'

వెళ్ళి చేరక తప్పదు. కొన్ని నెలలు నౌకరీ చేసిన తర్వాత ప్రయత్నం మీద కొంత దిగవచ్చు. ఏ జన్సీ వెళ్ళడానికి సిద్ధపడ్డాడు బుచ్చిరాజు. కానీ వనవాసం చెయ్యడానికి, సీతా దేవి కాదు ఒప్పుకోడానికి, మాణిక్యం. ఒప్పుకోలేదు. బుచ్చిరాజుకు కూడా ఆమెను అడివికి తీసుకు వెళ్ళడం యిష్టంలేదు. ఎంతో శ్రమ పడి సంపాదించుకున్న యిల్లాలు ఏ విషజ్వరం అయినా వచ్చి... ఆ చెడు ఆలోచన వచ్చేసరికి భయంతో వణికిపోయాడు.

*　　　*　　　*

మాణిక్యం ధన కనక వస్తు వాహనాలతో పట్నం చేరకొంది. బంగారానికి మెరుగు పెట్టినట్టు ప్రకాశిస్తోంది. ఆమెను వెనక చూసిన వాళ్ళు యిప్పుడు వెంటనే పోల్చుకోలేక పోతున్నారు. ఆమె మాత్రం అందరినీ పోల్చుకో గలుగుతోంది. అందరినీ మించి ఆకాశం అంత ఎత్తు ఎదిగిపోయినందుకు తనలో తాను గర్వపడుతోంది. ప్రతి నెలా ఐదవ తేదీ తిరగకుండా భర్త దగ్గరనుంచి మనియార్డరు వస్తోంది. ప్రపంచంలోని సమస్త సౌఖ్యాలూ డబ్బుతో లభ్యమౌతాయన్న సంగతి ఆమె యేనాడో తెలుసుకొంది. చిన్నప్పటి ఆలోచనలను ఇప్పుడు ఆచరణలో పెట్టి ఆనందిస్తోంది. రోజురోజుకు మారుతున్న ఫాషన్లతోపాటు ఆమె కూడా మారుతోంది. కొత్త చీరల కోసం షాపులన్నీ వెతుకుతోంది.

ఒకసారి ఒక షాపులో ఆమెకు ఒక మగవాడు కనిపించాడు. అతని పక్కని సాదా చీర కట్టుకొని మెళ్ళో పుస్తెలుతప్ప ఏ ఆభరణమూ లేని ఆడది కనిపించింది. మగవాణ్ణి ఆమె గుర్తు పట్టింది. అతనే లోగడ తనను కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటానన్న పేద యువకుడు. అప్పుడు ఆమె కూడా అతని అందానికి మోజుపడింది. ఆమెకు అతని మీద ప్రేమకలిగింది. లోలోపల ఇష్టపడింది. కానీ ఆమెలో వున్న విచక్షణా జ్ఞానం ఆ క్షణంలో ఆమెను ఘోర విపత్తునుంచి తప్పించింది. ప్రేమ అనేది గొప్పది కావచ్చు. పెళ్ళి అనే సాంఘిక బంధం ముందు తలవంచి తీరవలసిందే అది! పెళ్ళిమీదే భవిష్యత్తు ఆధారపడి వుంటుంది. ఆడదానికి ఐశ్వర్యంకాని, దరిద్రం కాని పెళ్ళి ద్వారానే సంక్రమిస్తాయి. ఆడదానికి రెండవసారి లభించే సదవకాశం పెళ్ళి. తొలిసారి పుట్టుకతో వచ్చిన దరిద్రాన్ని పెళ్ళి అనే ఈ రెండవ అవకాశంద్వారా తొలగించుకోవచ్చు! తద్వారా ప్రేమ కంటే— పెళ్ళి కంటే అధికమైన — భౌతిక

ప్రపంచం దృష్టిలో గొప్పదైన డబ్బు సంపాదించవచ్చు. ధన రాసుల మధ్య తిరగవచ్చు. తను అప్పుడు యితనినే పెళ్ళాడివుంటే ఏం జరిగేది ? ఇతని పక్కనివున్న ఆడవానిలా తనకూడా ముతక చీరతో, దరిద్రంతో, ముడతలువడ్డ శరీరంతో, నిరాభరణంగా, నిస్సారంగా, నీరసంగా వుండేది. తను చేసినది ఎంత గొప్ప పనో ఆమెకు యిప్పుడు పూర్తిగా బోధ పడింది. తను ఎంచుకున్న కొత్త చీరల్ని తీసుకొని షాపులోంచి బయట పడింది.

ఆ దారినే బావగారి యింటికి వెళ్ళింది. బావ యింకా కష్టాల లోంచి బయటపడలేదు. ధరలు పెరుగుతున్నాయి. ఖర్చులు పెరుగుతున్నాయి. డబ్బు లేనివాళ్ళ ఇళ్ళల్లో కరువు కాటకాలు తాండ విస్తున్నాయి. ఆర్నెల్ల అద్దె బాకీ పడినందువల్ల బావను బలవంతంగా ఇల్లు ఖాళీ చేయిస్తున్నారు. మాణిక్యం బావకు ధైర్యం చెప్పింది.

'బావా! నీ కొచ్చిన భయం లేదు. నేను ఇబ్బందుల్లో ఉన్నప్పుడు నువ్వు నన్ను ఆదుకున్నావు. ఇప్పుడు నువ్వు యిబ్బందులలో వున్నావు. కనక నీకు సహాయం చెయ్యవలసిన బాధ్యత నాది' అంది.

అనడమేకాక బావగారి కుటుం బాన్ని అంతా తన స్వంత ఇంటికి తరలించుకు పోయింది. ఆమె ఇంట్లో అడుగుపెట్టిన ఉత్తరక్షణం లోనే బావగారి దరిద్రం పటా పంచలై పోయింది.

'బావా! వెనక నువ్వు నన్ను సినిమాలకు తీసుకువెళ్ళే వాడివి. ఇప్పుడు నిన్ను నేను తీసుకు వెళ తాను. అంతేకాదు. ఇంకా చూడ వలసిన వూళ్ళు, తీర్చవలసిన మొక్కుబళ్ళు చాలా వున్నాయి' అంటుంది మాణిక్యం.

అనడమే కాదు. కలిసి మెలిసి తిరుగుతుంది. నవ్వుతుంది. ఇంట్లో వున్న వాళ్ళందరినీ సంతోష పెడు తుంది.

స్వంత యింట్లో సర్వ సౌఖ్యాల తోనూ నగరవాసం అనుభవిస్తోంది మాణిక్యం! అష్ట కష్టాలుపడి వన వాసం చేస్తున్నాడు బుచ్చిరాజు. కొండదిగడానికి ప్రయత్నిస్తున్నాడు. డబ్బుతో ఎలాంటి పనైనా సాధించ వచ్చుని అతని నమ్మకం. డబ్బులో వున్న గొప్పతనం అతనికి బాగా తెలుసు. మాణిక్యానికి అతని కంటే నూరు రెట్లు ఎక్కువ తెలుసు. అందుకే యిద్దరి మధ్యా ఎడబాటు వున్నప్పటికీ — వాళ్ళ దాంపత్య జీవితం వడిదుడుకులు లేకుండా హాయిగా సాగిపోతోంది.

***